పుష్కలంగా పాఠ్య పుస్తకాలు

- రెండో సెమిస్టర్ పుస్తకాలు సిద్ధం
- చినగదిలి మండలంలో 83 స్కూళ్లకు 46 వేల పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తున్న ఎండీ వ్యాన్‌లు



పాఠశాలలకు తరలించే పాఠ్య పుస్తకాలు, ఎండీ వ్యాన్ల గురించి వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో-2 అనురాధ

ఆరిలోవ: రెండో సెమిస్టర్ కోసం పాఠ్య పుస్తకాలను విద్యా శాఖ అధికారులు సిద్ధం చేశారు. సోమవారం నుంచి పాఠశాలలకు ఈ పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు తెరిచిన మొదటి రోజే మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. వీటిని చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పౌర సరఫరాల విభాగం వ్యాన్‌లు(ఎండీ)లో తరలిస్తున్నారు. గతంలో విద్యాశాఖ అధికారులే ప్రత్యేకంగా వాహనాలు బుక్ చేసుకుని వాటిలో పాఠశాలలకు పుస్తకాలను తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఆ సమస్య లేకుండా ఎండీ వ్యాన్లలో తరలించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నారు. చినగదిలి మండలంలో పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ కేంద్రాన్ని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను ఈ కేంద్రంలో సిద్ధం చేశారు. ఈ కేంద్రం నుంచి ఎండీ వ్యాన్ల ద్వారా మండలంలో పాఠశాలలకు తరలించడం ప్రారంభించారు. చినగదిలి ఎంఈవో-2 పి.అనురాధ, పౌర సరఫరాల విభాగం అధికారులు సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఆర్ఐ రమేష్, సీఆర్‌పీ అప్పలరాజు పాఠ్య పుస్తకాల సరఫరాను పర్యవేక్షిస్తున్నారు.

83 స్కూళ్లు.. 46,000 పాఠ్య పుస్తకాలు

చినగదిలి మండలంలో 83 ప్రభుత్వ పాఠశాలలున్నాయని ఎంఈవో-2 పి.అనురాధ తెలిపారు. వాటిలో ఉన్నత, ప్రాథమికోన్నత, మండల పరిషత్ పాఠశాలలున్నాయన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 46,000 పాఠ్య పుస్తకాలను రెండో సెమిస్టర్ కోసం సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం ఇప్పుడు మంచి ఆలోచనతో పౌర సరఫరా విభాగం అధికారులతో సంప్రదింపులు జరిపి ఎండీ వ్యానుల ద్వారా పుస్తకాల సరఫరాకు అవకాశం కల్పించిందన్నారు. దీంతో 16 ఎండీ వ్యాన్ల ద్వారా మండలంలో అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను తరలిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్‌స్టేషన్ 33/11 కేవీకి సంబంధించిన ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనులు ఈ నెల 20న జరగనున్నాయి. ఈ మేరకు చెట్ల కొమ్మలు నరికివేత, ఎల్‌టీ లైన్ మరమ్మతులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలోని కాల భైరవ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్య ప్రకాశ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మలు భక్తుల గోత్ర, నామాలతో అర్చనలు చేశారు.

కెరీర్‌పై ముందస్తు అవగాహన అవసరం

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత డిగ్రీ కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఆపర్చునిటీస్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిపుణురాలు ఆచార్య సంధ్యావాణి అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఎంబీఏ, ఎమ్మెస్సీ, బీఎస్సీ, బీకాం, బీబీఏ విద్యార్థులకు ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.. ఏయే రంగాల్లో స్థిరపడొచ్చు అనే విషయాలను వివరించారు. విద్యార్థులకు చదువుతో పాటు కెరీర్ ఆపర్చునిటీస్‌పై ముందస్తు అవగాహన అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పద్మజ, దేవిక, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పాత సామగ్రి వేలానికి టెండర్ల ఆహ్వానం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని ఏరియా ఆస్పత్రిలో పాత సామగ్రిని వేలం వేయనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఉష తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు కార్యాలయంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు వేలం బిడ్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. బిడ్ దరఖాస్తుకు రూ. 500 చెల్లించి దరఖాస్తును పొందాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పేరుతో రూ.5వేల డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. 25న బిడ్లు తెరిచి తక్కువ ధరకు కోట్ చేసిన టెండర్లను ఖరారు చేస్తామని తెలియజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

రైతుబజార్‌లో లీగల్ మెట్రాలజీ బృందం తనిఖీలు



ఎంవీపీ రైతు బజార్‌లో స్టాల్ వద్ద కాటా పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ బృందం సభ్యులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం లీగల్ మెట్రాలజీ(తూనికలు, కొలతల విభాగం) బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి.మనోహర్ ఆధ్వర్యంలో అధికారులు స్టాళ్లలో కాటాలు పరిశీలించారు. స్టాళ్ల నిర్వాహకులు సరిగా తూకం వేసి వినియోగదారులకు కూరగాయలు అందిస్తున్నారా? లేదా? అనే దానిపై ఆరా తీశారు. సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తున్న కౌంటర్లను కూడా పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి అందరికీ సబ్సిడీపై టమాటాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. తూకంలో మోసాలు జరగకుండా చూడాలని రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌కు సూచించారు. అనంతరం అక్కడ నుంచి పెద వాల్తేరు ప్రాంతంలో చికెన్, మటన్ షాపుల వద్దకు వెళ్లారు. అక్కడ తూకం సరిగా వేయని వర్తకులను గుర్తించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సభ్యులు పి.డి.వి.అప్పలరాజు, వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన పాపానికే..

- కుమార్తె ఆత్మహత్యపై తల్లిదండ్రుల ఫిర్యాదు



స్వప్న మృతదేహం

ఆరిలోవ: చినగదిలిలో ఆత్మహత్య చేసుకున్న శెట్టి స్వప్న(22) మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం సరవి గ్రామానికి చెందిన శెట్టి స్వప్న చినగదిలిలో అద్దింట్లో ఉంటూ రామాటాకీస్ సమీపంలో ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తుంది. సోమవారం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అనంతరం ఏఎస్ఆర్ జిల్లాలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె ఒంటరిగా ఉండడం, ఎలాంటి కారణాలు తెలియకపోవడంతో సంఘటన జరిగిన రోజు పోలీసులకు ఎలాంటి వివరాలు లభించలేదు. తల్లిదండ్రులు మంగళవారం వచ్చిన అనంతరం వారి నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. దీనిపై మృతురాలు తల్లిదండ్రులు శెట్టి గుణం, స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్వప్న తమ కుటుంబానికి తెలిసిన గొర్రెల చిన్నారావుకు రూ.85,000 అప్పు ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి అతను ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం చిన్నారావు.. స్వప్నకు ఫోన్ చేసి డబ్బులు విషయంపై మాట్లాడాడు. దీనిపై వారి మధ్య మాటామాటా పెరిగి ఫోన్‌లో తగాదా జరిగింది. మధ్యలో చిన్నారావు ఫోన్ ఆపేశాడు. క్షణికావేశంలో కొద్ది సేపటికి ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు



హాజరైన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: వర్షం కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. మంగళవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం సమావేశ మందిరంలో మలేరియా, డెంగ్యూ, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాలంలో అంటువ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సమయ పాలన పాటించాలని, పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, జిల్లా మలేరియా అధికారి తులసీ, జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ జగదీశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు మహిళా పోలీసులు సహకరించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సాయి

మర్రిపాలెం : నేరాలను నియంత్రణకు సచివాలయ మహిళా పోలీసులు సహకరించాలని కంచరపాలెం సీఐ ఎస్.సాయి కోరారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్టు గమనించినట్టయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న మైనర్లను లక్ష్యంగా చేసుకుని నగదును, సెల్‌ఫోన్లు కాజేస్తున్నారని, అలాంటివారిపై నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వారి ఫోటోలు సచివాలయ మహిళా పోలీసులకు అందజేస్తామని, తద్వారా వారి కదలికలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు సమీర్, రవికిషోర్, దివ్యభారతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

సీతమ్మధార : వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డెల్టాన్ కళాశాల్లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు వేగంగా నడపడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రామూర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరి కాలనీలో వెలుగులు



వెలుగుతున్న దీపం

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు కొండవాలు ప్రాంతం సింహగిరి కాలనీ, ప్రశాంతినగర్‌లలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. కొద్ది నెలలుగా ఆయా కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీనిపై 'సింహగిరి కాలనీలో అంధకారం' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ఆయా కాలనీల్లో సిబ్బంది పరిశీలించి వెలగని బల్బులను గుర్తించారు. ఆయా బల్బులను తొలగించి సుమారు 30కి పైగా స్తంభాలకు కొత్త బల్బులు అమర్చారు. దీంతో సాయంత్రానికి ఆయా కాలనీల్లో విద్యుత్ కాంతులు విరజిమ్మాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టీటీడీ కథల పోటీల ప్రారంభం

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు నిర్వహిస్తున్న కథ చెబుతారా.. ఊ కొడతాం పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు పురాణ, ఇతిహాసాలతో పాటు చారిత్రక అంశాలలో కథలు చెప్పాల్సి ఉంటుంది. మంగళవారం చంద్రపాలెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పోటీల్లో జి.కేశవ సుబ్రహ్మణ్యం, పి.తేజేశ్వరరావు, ఎస్.హరికలు విజేతలుగా నిలిచారు. ఈ నెల 21న విద్యాదరి పబ్లిక్ స్కూల్ గవరపాలెం, అనకాపల్లి, 24న గిరిజన వికాస కేంద్రం రంపచోడవరంలో ఈ పోటీలు జరగనున్నాయి.

శ్రీవారి సన్నిధిలో ఈడీ అధికారి



శ్రీవారి సన్నిధిలో ఈడీ ప్రభాకర్

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారి ప్రభాకర్ మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారికి అంతరాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సూపరింటెండెంట్ ఎ.వెంకటరమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ సి.శివకృష్ణ ఆయనకు ప్రసాదం అందజేశారు.

23న ఆర్పీ పట్నాయక్‌తో ముఖాముఖి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌తో ఈనెల 23న విశాఖ పౌరగ్రంథాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు మంగళవారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి. చిన్నారావు, బాబ్జి, అర్చన, గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఆచార్య పార్థసారథికి ఘన నివాళి



పార్థసారథి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు జి.పార్థసారథి వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు విభాగంలోని పార్థసారథి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావం, మేథస్సుతో కూడుకున్న పరిశోధన, ఆర్థిక నైపుణ్యం విశ్వవిద్యాలయానికి ఉపయుక్తంగా నిలిచాయన్నారు. ఆయన వద్ద విద్యార్థిగా తాను చదవుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆచార్య పార్థసారథిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.నాగరాజ, ఆచార్య డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, విద్యార్థులు, పరిశోధకులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లూయిడ్ డైనమిక్స్‌పై సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో కాంపుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ అంశంపై జరిగే రెండు వారాల వర్క్‌షాప్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. విద్యార్థులకు వాస్తవిక జ్ఞానాన్ని అందించేలా సదస్సు నిర్వహించడంపై ఆయన అభినందించారు. విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు కాంపుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్(సీఎఫ్‌డీ)పై విస్తృత అవగాహన, నూతన జ్ఞానాన్ని అందించేలా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలు వివరిస్తామన్నారు. ఈ సదస్సులో మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ డి.ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంపోజిట్ మెటీరియల్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్, ఎం.వెంకటేష్, అభిషేక్ నల్లూరిలు సంయుక్తంగా రచించిన ×డెవలప్‌మెంట్ ఆఫ్ బయో బేస్డ్ నానో పాలిమర్స్ కాంపోజిట్ మెటీరియల్స్‌÷ పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని లాంబర్ట్ పబ్లిషర్స్ సంస్థ ముద్రించింది. పరిశోధనాత్మక ఫలితాల ఆధారంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. పుస్తక రచయితలను ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ అభినందించారు.

వేధింపులపై విచారణకు డిమాండ్



మెయిన్‌గేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణపై పరిశోధకురాలు చేసిన లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏయూ మెయిన్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వై.రాంబాబు, అచ్యుతరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ గతంలో కూడా సదరు ఆచార్యునిపై ఆరోపణలు ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోని కారణంగా ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారించాలన్నారు.

సబ్సిడీ టమాటాకు వర్షంలోనూ బారులు



టమాటా విక్రయ కౌంటర్ నుంచి గేటు దాటి గొడుగులు వేసుకుని క్యూలో ఉన్న వినియోగదారులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు బారులు తీరారు. మంగళవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు వేసుకొని క్యూలో గంటలు తరబడి నిరీక్షించారు. రెండు రోజుల పాటు రైతుబజార్‌లో టమాటాల విక్రయాలు జరపలేదు. మంగళవారం ఉదయం విక్రయాలు జరుపుతున్నట్లు తెలుసుకున్న వినియోగదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచే వర్షంలో గొడుగులు వేసుకుని నిల్చున్నారు. ఈ క్యూ టమాటా విక్రయాల కౌంటర్ నుంచి గేటు దాటి వాహనాల పార్కింగ్ ప్రదేశం వరకు కూడా కొనసాగింది. బుధవారం రైతుబజార్‌కు సెలవు కావడంతో మంగళవారం పెద్ద సంఖ్యలో వినియోగదారులు సబ్సిడీ టమాటాల కోసం ఇలా క్యూ కట్టారు. ఒక్కరోజులో సుమారు ఐదున్నర మెట్రిక్ టన్నుల టమాటా విక్రయం జరిగినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.

ఘనంగా భూలోకమాత అనుపోత్సవం



భూలోకమాత అమ్మవారు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని భూలోకమాత అమ్మవారి అనుపు ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించుకున్నారు. ఘటాలను శిరస్సుపై పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అర్చకుడు సాయి పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాత వెంకోజీపాలెంలోని కనకమ్మ ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

తీరానికే పరిమితం



వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

కొమ్మాది: సముద్రంలో ప్రతికూల పరిస్థితులతో తీర ప్రాంతాల్లో చేపల వేట నిలిచిపోయింది. గత నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు, వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో తీరం అల్లకల్లోలంగా మారింది. దీంతో మత్స్యకారుల చేపల వేట నిలిచిపోయింది. ప్రస్తుతం వారంతా తీరంలో వలలు, పడవలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకున్నారు. వలలు అల్లుకుంటూ, పడవల మరమ్మతులు చేసుకుంటున్నారు. నాలుగు రోజుల నుంచి వేట లేకపోవడంతో జీవనోపాధి కష్టంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిష్ ఆంధ్రా స్టాల్ ప్రారంభం

జగదాంబ : యువతకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్సిడీతో జగనన్న ఫిష్ ఆంధ్రా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో నిరుద్యోగ సమస్య తొలగడంతో పాటు కుటుంబ పోషణ సులభమవుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్‌లో తెలియజేస్తే ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్రా దుకాణదారుడితో మాట్లాడుతూ పారదర్శకంగా వ్యాపారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.